

# బంగారం కొట్టులో మన 'అసిస్టెంటు' నౌకరి

మా యిద్యానికేతన్‌లో హైమవతీ అనే హిందీ టీచరు వుండేది. ఆ టీచరు ఎప్పుడూ నవ్వతా, అరిచేతిలో చాకోపీసు ముక్క దొర్లించుకుంటా 'ఠండే జామూన్ గరమ్ జామూన్' పాఠాలు చెప్తా వుండేది.

హైమవతి టీచరు చెప్పే పాఠాలు మా కిలాసులోని క్లవర్లకంటే నాకే బాగా అర్థమవతా వుండే సరికి (మా యింట్లో మాట్లాడే హమ్, తుమ్, హయ్యి, నయ్యి బాష అర్థమవడం నాకొక లెక్క?) హైమవతి టీచరుకి నేనంటే బలే ప్రేమ ఏర్పడింది. అదీగాక, మా యింటికి దగ్గరగా వుండే గురవయ్య శెట్టోళ్లింట్లో ఆమె బాడిక్కి వుండేది కాబట్టి 'మా యింటికి రారా' అంటా పిలస్తా వుండేది. పొయ్యినప్పుడల్లా పప్పు చెక్కలు, మనుబూలు పెట్టేది. 'ఎత్తిపోసుకో' అనకుండా పెదాలకి కరిపించుకొని తాగతా వున్నా తాగడానికి నీళ్లిచ్చేది.

నాలిక్కి మంచి చిరుతిండి తగలతా వుందికదా అని వాళ్లింటికి మరిగినానుకానీ ఎండాకాలం సెలవలొచ్చేసరికి నా దుంప తెగింది. ఆ సెలవలకి హైమవతి టీచరోళ్ల అక్క కొడుకు 'విశ్వం' అనే అదనప్రసంగిగాడు వచ్చినాడు వాళ్లింటికి. నా కర్మగాలి వాడిది కూడా నా వయసే. ఆరు రాసినాడంట.

'అబ్బ! బలే దొరికినావురా. మనిద్దరం కలిసి హాయిగా లెక్కలు చేసుకోవచ్చు' అన్నాడు వాడు నాతో మాట కలిపీ కలపంగానే.

నా గుండె గుబేలుమంది. 'లెక్కలేంది?' అన్నాను బిక్కుబిక్కుమంటా.

'ఏడో కిలాసు లెక్కలు సామీ. యిప్పటి నుంచే చెయ్యకపోతే కామను పరీక్షల్లో ఫస్టు మార్కులు ఎట్టా వస్తాయి?' అన్నాడు వాడు, యీ పద్ధతే నీకసలు తెలియదా అన్నట్టుగా నా

మీద జాలిపడతా.

నేను బెదురు బెదురుగా చూసినాను వాణ్ణి. ఆ తర్వాత రెండు మూడు రోజుల్లోనే వాడి యవ్వారం తెలిసిపోయింది నాకు. వాడంటా... ప్రతి ఎండాకాలం సెలవల్లోనంటా... చేరబోయే కిలాసులోని లెక్కలు చేసుకుంటా కూచుంటాడంట. అయిదో కిలాసు సెలవల్లోనే ఆరో కిలాసు లెక్కలు మొదలు పెట్టినాడంట. ఇప్పుడు ఆరో కిలాసు సెలవల్లో ఏడో కిలాసు లెక్కలు మొదలు పెడతాడంట.

రెండు కాళ్లూ పట్టుకొని లాగి 'దబీ'మని కిందపడేద్దామా అనిపించింది నాకు వాణ్ణి చూస్తానే. యిట్టాంటి నాయాళ్లు వుండబట్టే కదా వీళ్లతో పోల్చి మార్కులు తక్కువ వస్తా వున్నాయని మాల్యాద్రయివోరులాంటోళ్లు నాబోటోళ్లని సావమూకేది అని కూడా అనిపించింది.

అంతే. మరుసటి రోజు నుంచి హైమవతీ టీచరులా. గీమవతీ టీచరులా. అసలు ఆ దోవన పోవడమే మానుకున్నాను. ఎందుకంటే విశ్వంగాడు తగులుకున్నాడంటే మనకు సెలవల్లో ఎంజాయిమెంటూ దానితో పాటు రోజుకి రెండు రూపాయల ఆదాయమూ పోయేటట్టు వుంది.

ఏమి రెండు రూపాయల ఆదాయమూ? అంటే నేను ఎండాకాలం సెలవల్లో మా తాత మస్తాన్‌సాయిబు బంగారు అంగడిలో కూచొని రోజుకు రెండు రూపాయిలు సంపాదిస్తాను-అసిస్టెంటు నౌకరి చేసి.

అసిస్టెంటు నౌకరీ అంటే ఏమీలా. పొద్దున్నే ఎనిమిది గంటలకల్లా అంగడికి రావడం, చీపిరి తీసుకొని దుమ్ము లేచిపోయేలా అంగడంతా చిమ్మడం, రైల్వే రోడ్డులోని మసీదు కాడికెళ్లి కూజా నిండుగా మంచినీళ్లు తెచ్చిపెట్టడం, యినప్పెట్ట తుడవడం, ఆనేక కుంపటి ముందర గోతాం పట్ట పరుచుకొని కూచోవడం. అంతే.

మా కావల్లో బంగారు అంగళ్లన్నీ వుండే విష్ణాలయం వీదికి ఎంట్రన్సులోనే మా తాత బంగారంగడి వున్నా పేరుకే అది బంగారంగడి. నెక్లెస్‌లూ, డాలరుదండలూ, బంగారు సరుడులూ మా అంగట్లో వుండవు. తాళిబొట్లు, బేసర్లు, రాళ్లకమ్మలు, వెండి పట్టీలు, కాలిమెట్టెలు... వీటినే ఎక్కువగా అమ్మతా వుండేవాడు మా తాత. వీటిని అమ్మతానే దండ తెగిందనో, కమ్మలో రాళ్లు వూడినాయనో వచ్చే రిపేరు పనులు చేసి యింక రొన్ని డబ్బులు సంపాదించేవాడు.

యిట్టాంటి రిపేరు పనులకి నిప్పుల కుంపటి, ఇనప 'పట్టెడ'లతోటే పని కాబట్టి మన

అసిస్టెంటు నౌకరీలో ప్రదాన విది ఏమంటే మా తాత వచ్చే టయానికి యీ రెండింటినీ రెడీ చేసి పెట్టడం.

పట్టెడ మీద ఇసక, నీళ్లు పోసి సుత్తితో రుద్దీ రుద్దీ దానిని తెల్లంగా చేయడం పెద్ద కష్టమేమీ కాదుకానీ కుంపటిని వెలిగించడమే బలే కష్టం. అది ఒక పట్టాన వెలగనే వెలగదు. దాన్లోని చల్లారిన బూడిదనంతా పారబోసి, కొత్త వడ్ల పొట్టు కూరుకొని, నడిమద్యన బొగ్గులు కుప్పగాపోసి మెల్లగా నిప్పంటించబోతే అవి అంటుకుంటేగా? వూది వూది గొంతు పొంగించుకున్నా అవి మాట వినేవి కాదు. నూనెలో ముంచిన గుడ్డపీలికని వాటిమద్యన యిరికించి ఆ పీలికకి మంటపెడితే అప్పుడంటుకునేవి.

మా తాతకు నేను అసిస్టెంటునే కాకుండా రిలీవరుని కూడా. అంటే మా తాత అన్నానికీ నమాజుకీ పోయినప్పుడల్లా అంగడిని కాపెట్టుకోని వుండాలి. బేరాలేమైనా వస్తే మా తాత వచ్చేదాకా వాళ్లని కూచోపెట్టాలి.

మా కొట్టుకి ఏదైనా పెద్ద బేరం వస్తే నాకు బలే బెదురుగా వుండేది. ఆడోళ్లు మొగోళ్లు గుంపుగా వచ్చి బంగారు వస్తువులు కొనాలనుకుంటారు కదా, ఆ టయిములో మాతాత ఏమడిగితే అది అందివ్వడానికి అలర్టుగా వుండాలి. బేరం కుదిరి ఆ వచ్చినోళ్లు ఏదో ఒక వస్తువు కొనుక్కొనెళితేనే మనం బతికి బయటపడ్డట్టు. లాకుంటే చచ్చినామే. బేరం చేజారి పోయిందన్న కోపంతో మనం చిన్న తప్పు చేసినా వూదుడుగొట్టాన్ని మీదికి విసిరేస్తాడు మా తాత.

ఎండాకాలం సెలవల్లో నెల్నాళ్లన్నా మా తాతకాడ పని చేసేవాణ్ణి కాబట్టి తక్కిన బంగారు అంగళ్లలో వున్న నాబోటి అసిస్టెంటు పిలకాయలందరూ పరిచయమయ్యేవాళ్లు నాకు. నేనన్నా ఎండాకాలం సెలవల్లోనే ఈ పని చేసేవాణ్ణికానీ వీళ్లు మాత్రం అన్ని రోజులూ యీ పనిలోనే వుంటారంట.

నేను ఆచ్చుర్యపోయి 'మీరు యిస్కూల్లో చేరరా?' అని అడిగినాను ఒకసారి. 'ఇస్కూలా? దాని గడపే తొక్కలేదు తెలుసా?' అన్నారు వాళ్లు.

'ఎందుకని?' అన్నాను.

'ఏమో. యీడ మా నాయిన చేర్పించినాడు. రోజుకి రెండు రూపాయిలు వస్తుళ్లా' అన్నారు.

మా విష్ణాలయం వీదిలోని బంగారు అంగళ్లన్నీ సాయిబులవీ శెట్టిగార్లవే అయినా అసిస్టెంట్లు మాత్రం పదికి తొమ్మిది మంది సాయిబుల పిలకాయలే వుండేవాళ్లు. వీళ్లు తిప్పలు పడో తన్నులు తినో కంసాలి పని నేర్చుకుంటా వుండేవాళ్లు. నేను అసిస్టెంటు పని

చేసేది సాయంగా మా తాతకాణ్ణే కాబట్టి వీళ్లందరికన్నా నా పరిస్తితి ఎంతో బెటరుగా వుండేది. మా తాత రోజులో రెండు మూడు సార్లు టీ తాపించేవాడు. వీదిలో మామిడికాయ బుట్టో జాంకాయ బండో వస్తే నాకు కొనిపెట్టేవాడు. సాయింత్రం ఆరవంగానే గల్లాపెట్టెలో నుంచి రెండు రూపాయి బిళ్లలు తీసిచ్చి 'యింకింటికిపోరా' అని పంపించేసే వాడు. (తక్కిన అసిస్టెంట్లు అంగళ్లు మూసేదాకా వుండాలి).

ఒక రోజు తుమ్మలపెంట పట్టెపోళ్లకు ఏమి పండగొచ్చిందో, ఏమి చాపలు పడినాయోగానీ మా కొట్టుకి ఉప్పెనలాగా వచ్చిపడి చాలా సొమ్ములు కొనుక్కెళ్లినారు, చెప్పిన రేటుకే. యింకారోజు మా తాతకి పట్టనలివిగాలా. ఆరు కొట్టక ముందే నన్ను యింటికి పంపించేస్తా 'ఇవాళ ఐదు. స్పెషలు' అంటా నా చేతిలో అయిదు రూపాయి బిళ్లలు పెట్టినాడు, నవ్వతా.

ఎగిరి గంతేసినాను. అన్ని డబ్బులు. నేనే సంపాదించడం... మాటలా? సంతోషంతో ఒళ్లు పొంగతా వుంటే అదే ఊపులో విశ్వంకాడికి పరిగెత్తుకుంటా వెళ్లి 'నువు లెక్కలు చేసుకుంటా సావరా. నేను అయిదు రూపాయలు సంపాదించాను చూడరా' అన్నాను మెడ ఎగరేస్తా.

వాడు లెక్కల నోటుబుక్కులోని కుడిపక్క మార్జినులో రఫ్ వర్కు మాని తల పైకెత్తి నవ్వినాడు. 'యిందాకట్నించి చేస్తా వున్నాను. యిప్పటికొచ్చిందిరా యీ లెక్క' అంటా నా తట్టు చూసి సంతోషంగా నవ్వినాడు.

ఎందుకనోగానీ వాడట్ట నవ్వతానే వుండిపోయినాడు.

★

(ఆ తర్వాత విశ్వంగాడు వాళ్ల నాయిన పనిచేసే వూర్లో మంచి కాలేజీ లేదని మా జవహర్ భారతిలో నాతో పాటు ఎంపిసి చేరినాడు. జూనియర్ ఇంటరు సెలవల్లో సీనియర్ ఇంటరు లెక్కలు, సీనియర్ ఇంటరు సెలవల్లో ఎంసెట్ లెక్కలు చేసి ర్యాంకు సంపాదించి బిటెక్కులో చేరినాడు. నేనేమో క్వాలిఫయింగ్ మార్కులు కూడా రాక, లాంగుటర్మ్‌కు పోలాక డిగ్రీలో చేరినాను. ఇప్పుడు విశ్వంగాడు రెండు జేబుల్లో జీతం పెట్టుకునేంత పెద్ద ఉద్యోగం చేస్తా వున్నాడుగానీ ఈ కత వాడి కోసరమో నా కోసరమో రాయలా. మా జరినాంటీ పిలకాయల కోసరం రాసినాను. మా జరినాంటీ చిన్నకొడుకు పదమూడేళ్ల జావెద్‌గాడు, ఆఖరు కొడుకు పదేళ్ల మున్నాగాడు చదువు మానేసి ఇప్పుడు బంగారు అంగళ్లలో అసిస్టెంట్లుగా చేస్తా వున్నారు. జరుగుబాటు కోసరం బంగారం లాంటి చదువు మానేసిన ఆ బంగారు తండ్రులు ఆ దారిన పోయినప్పుడల్లా కుంపటి ముందర కూచొని నిప్పులు మంటేస్తా కనిపిస్తే ఆ బాద ఏ తీరున చెప్పను?).

